లాభాల 'గుమ్మడి'..

- తక్కువ పెట్టుబడి.. అధిక దిగుబడి
- వినూత్న పంట సాగు చేస్తున్న యువ రైతు
- పీజీ వరకు చదువుకొని.. బూడిద గుమ్మడి సాగు..

పంటచేనులో బూడిద గుమ్మడికాయలను కోస్తున్న రైతులు

జన్నారం, ఏప్రిల్ 29 : జన్నారం మండల కేంద్రానికి చెందిన గర్రెపెల్లి శుభాష్‌గౌడ్.. వినూత్న పంట సాగుచేస్తూ లాభాలు గడిస్తున్నాడు. పీజీ వరకు చదువుకున్న ఈ యువ రైతు బూడిద గుమ్మడి పండిస్తూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధిస్తున్నాడు. కలమడుగు గ్రామ శివారులో తన 16 ఎకరాల పంట చేనులో కొత్తగా ఎవుసం చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు. 20 గుంటల్లో బూడిది గుమ్మడి కాయల పంట వేశాడు. కరీంనగర్‌లోని ఓ ఫర్టిలైజర్ దుకాణంలో రూ.3 వేలతో విత్తనాలను తెచ్చి, ఇక్కడ విత్తుకున్నాడు. ఈ పంట సాగుకు నీరు కూడా ఎక్కువ అవసరం లేదు. చేనులో తీగలుగా అల్లుకొని.. పూలు పూసి.. కాయలుగా మారాయి. నాలుగు నెల్లోనే పంట చేతికి వచ్చింది. కాగా, ఒక్కో గుమ్మడికాయకు మార్కెట్‌లో రూ.100 నుంచి రూ.150 ధర పలుకుతున్నది. ఇందుకు అనుగుణంగానే మార్కెట్‌లో విక్రయించగా, పెట్టుబడి పోనూ రూ.60 వేల లాభం వచ్చినట్లు ఈ యువ రైతు వివరించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం వచ్చే పంటలపై రైతులు దృష్టి పెట్టి, ఆర్థికంగా ఎదగాలని కోరుతున్నాడు.

రైతులు ఆర్థికంగా ఎదగాలి..

రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు తక్కువ భూమిలో ఎక్కువ లాభం వచ్చే పంటలు సాగుచేయాలి. ముందుగా ఎలాంటి పంట వేస్తే బాగుంటుందో తెలుసుకోవాలి. అందుకు అనుగుణంగా పెట్టుబడి తక్కువ, లాభాలు ఎక్కువ వచ్చేవి ఎంచుకోవాలి. అప్పుడే రైతులు ఆర్థికంగా ఎదుగుతారు.

- గర్రెపెల్లి శుభాష్‌గౌడ్, పానకల్, యువ రైతు

ఓటు హక్కు వినియోగించుకోవాలి

- ఆర్డీవో ఆఫీస్‌లో స్వీప్ ఆక్టివిటీ

అందరూ ఓటు వేయాలని కోరుతున్న ఆర్డీవో రాములు

హాజీపూర్, ఎంసీఎల్ 28 : పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆర్డీవో రాములు, టీఎన్జీవో అధ్యక్షుడు గడియారం శ్రీహరి సూచించారు. మంచిర్యాల ఆర్డీవో కార్యాలయంలో స్వీప్ ఆక్టివిటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పాల్గొని మాట్లాడారు. 'నేను ఖచ్చితంగా ఓటు వేస్తాను, మీరందరూ ఓటువేయాలి' అని కోరారు. ఓటు వేయాలని కోరుతు ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీనియర్ క్రీడాకారుడికి సన్మానం

సీసీసీ నస్పూర్, ఏప్రిల్ 28 : బ్యాడ్మింటన్ సీనియర్ క్రీడాకారుడు సాగర్ల రాజన్న అలియాస్ గ్యాస్ రాజన్నను పలువురు షటిల్ క్రీడాకారులు ఆదివారం ఘనంగా సన్మానించారు. 40 ఏండ్లుగా బ్యాడ్మింటన్ కొనసాగిస్తున్న రాజన్నను సీసీసీ ఆర్‌కే-5కాలనీ షటిల్ కోర్టులో శాలువాలతో సత్కరించారు. అనంతరం క్రీడాకారులు మాట్లాడుతూ.. క్రీడలకు వయస్సు అడ్డుకాబోదన్నట్టుగా 63 ఏళ్ల వయస్సులో బ్యాడ్మింటన్ ఆడుతుండడం అభినందనీయమన్నారు. 40 ఏళ్లుగా ఆడుతూ నేటి యువతకు ఆయన ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బ్యాడ్మింటన్ క్రీడాకారులు శెట్టి అశోక్, కొట్రంగి రంజిత్, కందుల వరి, సిరికొండ రవి, కొల్లి రాజు, మైదం రవి, సురేశ్, కమలాకర్, చంద్రమౌళి, శ్రీనివాస్, వెంకటేశ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో చుక్కల దుప్పికి గాయాలు

రామకృష్ణాపూర్, ఏప్రిల్ 28 : మందమర్రి మండలం బొక్కలగుట్టలోని గాంధారి వనంలో గల జింకల ఆవాస కేంద్రంలో ఆదివారం ఉదయం కుక్కలు దాడి చేయగా, ఓ చుక్కల దుప్పి తీవ్రంగా గాయపడింది. జింకల ఆవాస కేంద్రంలోనికి వెళ్లిన కుక్కలు దుప్పి వెంట పడడంతో అక్కడి నుంచి నుంచి బయటకు వచ్చింది. గమనించిన స్థానికులు గోపాలమిత్ర సూపర్‌వైజర్ ఆకుతోట రవి సాయంతో ప్రథమ చికిత్స అందించారు.

కార్మిక వ్యతిరేక బీజేపీని ఓడించాలి

కాగజ్‌నగర్, ఏప్రిల్ 28 : కార్మిక వ్యతిరేకి, కార్పొరేట్, మతోన్మాది పార్టీ బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు పిలుపునిచ్చారు. కాగజ్‌నగర్ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం జిల్లాస్థాయి సదస్సు నిర్వహించారు. పదేళ్లుగా కార్మిక వర్గాన్ని, దేశ ప్రజలను మోసం చేసిన బీజేపీ, మూడోసారి అధికారం చేజిక్కించుకునేందుకు జిమ్మిక్కులు చేస్తున్నదని ఆరోపించారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లిస్తే తప్ప కార్మికుడు బతకలేని పరిస్థితుల్లో ఉన్నారని స్పష్టం చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి ముంజం శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షురాలు ఆర్ త్రివేణి, నాయకులు శ్రీకాంత్, శంకర్, సంజీవ్, కష్ణ, విలాస్, అంకయ్య, విఠల్, చంద్రకళ, రాజేశ్వరి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం

రెబ్బెన, ఏప్రిల్ 28 : రెబ్బెన ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఆదివారం వ్యవస్థాపక చైర్మన్ తుమికి ప్రభాకర్‌రాజు 74వ జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినటుల ప్రిన్సిపాల్ ఎంఏ జాకీర్ ఉస్మానీ తెలిపారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీనివాసరాజు, డైరెక్టర్ శశిధర్‌రాజు, గణితశాస్త్రం అసిస్టెంట్ ప్రొఫెసర్ నవీన్‌చందర్‌రాజు, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవీద్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్‌పై అవగాహన

అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ ఉత్తమ్‌కుమార్

దహెగాం, ఏప్రిల్ 28 : మండల కేంద్రంలో ఆదివారం సైబర్ క్రైమ్‌పై పోలీస్‌లు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ ఉత్తమ్‌కుమార్ మాట్లాడుతూ.. ఎవరూ సైబర్ నేరాలకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే సైబర్ నేరాలు ఎలా జరుగుతాయో వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

టాపర్‌కు అభినందనలు

సాయిజను సన్మానిస్తున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్

చెన్నూర్ రూరల్, ఏప్రిల్ 28 : చెన్నూర్ మండలం పొక్కూర్ గ్రామానికి చెందిన చీర్ల దివాకర్-సునీత కూతురు చీర్ల సాయిజ ఇంటర్ ఫస్టియర్‌లో 468 (ఎంపీసీ)మార్కులతో రాష్ట్రస్థాయిలో టాపర్‌గా నిలిచింది. కాగా, ఆ విద్యార్థినిని గ్రామస్తులు శాలువాతో ఘనంగా సన్మానించి, అభినందించారు. సాయిజ హన్మకొండలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నది. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మల్లెల దామోదర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కుక్కడపు నరేందర్, గ్రామస్తులు రమేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబలి కేంద్రాలు ప్రారంభం

శ్రీరాంపూర్, ఏప్రిల్ 28 : నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని నస్పూర్ కాలనీ హౌసింగ్ బోర్డు కాలనీ చౌరస్తా, సీసీసీ కార్నర్, శ్రీరాంపూర్ కాలనీలో కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాలను ఆదివారం ట్రస్ట్ కార్యదర్శి కొక్కిరాల సత్యపాల్‌రావు, రుక్మిణి ప్రారంభించారు. నస్పూర్ మున్సిపల్ చైర్మన్ సుర్మిల్ల వేణు, మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు బండారి సుధాకర్ పాల్గొన్నారు.

నియామకం

శ్రీరాంపూర్, ఏప్రిల్ 28 : సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్(బీఎంఎస్) కేంద్ర ఉపాధ్యక్షుడిగా శ్రీరాంపూర్‌కు చెందిన చాట్ల ఆశోక్‌ను ఆదివారం బీఎంఎస్ బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జి, కార్యదర్శి కొత్తకాపు లక్ష్మారెడ్డి నియమించారు. శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కేంద్ర జనరల్ బాడీ సమావేశంలో చాట్ల ఆశోక్‌ను కేంద్ర ఉపాధ్యక్షుడిగా నియమించి అభినందించారు. సమావేశంలో బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, జాతీయ కార్యదర్శి మండ రమాకాంత్, మాధవనాయక్, సింగరేణి విభాగం ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్, నాయకులు మోహన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం..

దండేపల్లి : 2006-07 బ్యాచ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

కొటాల : సెయింట్ జోసెఫ్స్ ఉన్నత పాఠశాల 2004-05 బ్యాచ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

దండేపల్లి, ఏప్రిల్ 28 : దండేపల్లి మండలం రెబ్బెన్‌పెల్లి జడ్పీ ఉన్నత పాఠశాల 2006-07 పదో తరగతి బ్యాచ్.. ఆత్మీయంగా ఒక్కచోట చేరింది. 18 యేండ్ల తర్వాత అ'పూర్వ' సమ్మేళనంగా కలుసుకున్నది. అందుకు ఆదివారం అదే పాఠశాల వేదికైంది. ఆనాటి ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థుల కలయికతో రోజంతా ఉత్సాహ భరిత వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా వారి సంతోషానికి అవధుల్లేకుండా పోయాయి. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలు, మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. అనంతరం తమ గురువులను ఘనంగా సన్మానించారు.

కొటాలలో..

కొటాల, ఏప్రిల్ 28 : మండలంలోని విజయనగరం జెయింట్ జోసెఫ్స్ ఉన్నత పాఠశాల 2004-05 బ్యాచ్ విద్యార్థులు అ'పూర్వ' సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి తీపి గుర్తులను నెమరువేసుకున్నారు. ఒకరినొకరు యోగ క్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం అప్పటి ప్రధానోపాధ్యాయులు ఫాదర్ జేమ్స్‌తో ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. 20 ఏండ్ల తర్వాత ఒక్కచోట కలుసుకోవడం ఆనందంగా ఉందని పూర్వ విద్యార్థులు భావోద్వేగానికి గురయ్యారు. ఇక్కడి ఉపాధ్యాయులు నేర్పిన విద్యా బుద్ధుల వల్లే నేడు తామంతా ఉన్నత స్థానాల్లో ఉన్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫాదర్ సిజో, షాదర్ టోం, అప్పటి వైస్ ప్రిన్సిపాల్ ఆలీస్, ఉపాధ్యాయులు మారయ్య, ఇందిరాదేవి, వెరోనిక, టీ శ్రీనివాస్, జీ శ్రీనివాస్, సురేశ్, ఘన్‌శ్యాం, నగేశ్, ఎస్ శ్రీనివాస్, నానాజీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

టేకుమట్లలో కొనుగోలు కేంద్రం వద్ద అదనపు కలెక్టర్ మోతీలాల్

జైపూర్, ఏప్రిల్ 28 : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని మంచిర్యాల అదనపు కలెక్టర్ మోతీలాల్ నిర్వాహకులను ఆదేశించారు. మండలంలోని డీసీఎంఎస్, పీఏసీఎస్, ఐకేపీ వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఆయన పరిశీలించారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని ఎలాంటి కోతలు లేకుండా కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. అలాగే రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలన్నారు. ఆకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ఇందారం గ్రామంలో గల జయలక్ష్మి, మంజునాథ రైస్‌మిల్లులను తనిఖీ చేశారు. ఆయన వెంట డీజీఎంఎస్ మేనేజర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ అనంతరం శారీరక శ్రమతోనే ఆరోగ్యం

రవీందర్ దంపతులను సన్మానిస్తున్న సీనియర్ క్రీడాకారులు, రిటైర్డ్ సీబీసీఐడీ డీఎస్పీ రవికుమార్

బెల్లంపల్లి, ఏప్రిల్ 28 : సింగరేణి ఉద్యోగులు రిటైర్డ్ అనంతరం శారీరక శ్రమతోనే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని రిటైర్డ్ సీబీసీఐడీ డీఎస్పీ పులాల రవికుమార్ అన్నారు. పట్టణంలోని సీఈఆర్ క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన సీనియర్ క్రీడాకారులు దామెర రవీందర్, నూరొద్దీన్ దంపతుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శారీరక శ్రమను దినచర్యలో భాగస్వామ్యం చేసుకోవాలని సూచించారు. అరుణ, రవీందర్ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీడీఎస్ మాజీ అధ్యక్షురాలు మృతి

బెల్లంపల్లి, ఏప్రిల్ 28 : సీడీఎస్ మాజీ అధ్యక్షురాలు తోడే పద్మారెడ్డి(55) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం దవాఖాలో చికిత్స పొందుతూ మృతి చెందారు. బెల్లంపల్లి శాఖ కాళోజీ గ్రంథాలయ పోటీ పరీక్షల అభ్యర్థులు ఆమె మృతిపై ప్రగాఢ సానుభూతి తెలిపారు. రెండు నెలలుగా ఆమె కొడుకు ఎన్‌ఆర్ఐ తోడే వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉచితంగా భోజనం అందిస్తున్నారు. నియోజకవర్గంలోని బీఆర్ఎస్, టీడీపీ, కాంగ్రెస్, స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు సానుభూతి ప్రకటించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్ బాబు

కాగజ్‌నగర్, ఏప్రిల్ 28 : కాగజ్‌నగర్ మండలం బారేగూడ గ్రామానికి చెందిన మందాడే రాజన్న కుటుంబానికి సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు ఆదివారం ఆర్థిక సాయం అందించారు. రెండు రోజుల క్రితం గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధమైన విషయం తెలిసిందే. ఈ తరుణంగా ఎమ్మెల్యే బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ప్రభుత్వం నుంచి సాయం అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట కోట గుండయ్య, గణపతి, వెంకటి, భిక్షపతి, పోచయ్య, అర్జున్, వేణు, హన్మంతు, తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899, 9640468899
NT-311840-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

విద్యార్థినికి సన్మానం

శృతి పటేల్‌ను సన్మానిస్తున్న కాపు సంఘం నాయకులు

తాండూర్, ఏప్రిల్ 28 : ఇంటర్ ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో సత్తాచాటిన మాదారం టౌన్‌షిప్‌నకు చెందిన శృతి పటేల్‌ను తాండూర్ మండల మున్నూరు కాపు సంఘం, యువత ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఇందూరి రమేశ్-విమల దంపతుల కూతరు శృతి.. ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో 466 మార్కులు సాధించి, రాష్ట్రస్థాయిలో రాణించింది. ఈ కార్యక్రమంలో తాండూర్ మండల మున్నూరు కాపు సంఘం, యువత మండలాధ్యక్షుడు కుమ్మరి సత్యనారాయణ, గందం మల్లేశ్, యువత జిల్లా ఉపాధ్యక్షుడు అంబీర్ మహేందర్, గ్రామకుల పెద్దలు మలిశెట్టి సత్యనారాయణ, అంబీర్ రాజేందర్, నార సంజీవ్, తొగరి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మాల సంఘం నేత మృతికి సంతాపం

సీసీసీ నస్పూర్, ఏప్రిల్ 28 : సీసీసీ నస్పూర్‌కు చెందిన మాల సంఘం సీనియర్ నాయకుడు పసరగొండ రాజయ్య అనారోగ్యంతో మృతిచెందారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు రాజయ్య ఇంటికి వెళ్లి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు గజెల్లి లక్ష్మణ్, జై భీమ్ సైనిక్ దళ్ రాష్ట్ర కన్వీనర్ ఆసాది పురుషోత్తం, జిల్లా ఉపాధ్యక్షుడు జే నర్సింగ్, మంచిర్యాల నియోజకవర్గం అధ్యక్షుడు గర్శె రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

బావిలోపడి కూలీ మృతి

లక్సెట్టిపేట, ఏప్రిల్ 28 : మండలంలోని కొత్తూర్ గ్రామ శివారులో గల వ్యవసాయ బావిలో పడి మధ్యప్రదేశ్‌కు చెందిన వలస కూలీ లాల్‌దాస్‌కొంరే(31) మృతి చెందినట్లు ఎస్ఐ చంద్రకుమార్ ఆదివారం తెలిపారు. ఐదు రోజుల క్రితం పట్టణంలోని ఓ మామిడికాయల మండిలో పనిచేసేందుకు తన గ్రామానికి చెందిన మరో నలుగురితో కలిసి వచ్చాడు. ఒక్కరోజు పనిచేసి ఇంటికి వెళ్తున్నానని చెప్పి వెళ్లిపోయాడు. ఆదివారం ఉదయం కొత్తూర్ శివారులోని వ్యవసాయ బావిలో మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. లాల్‌దాస్ కొంరెకు అతిగా మద్యం తాగే అలవాటు ఉండడంతో మత్తులోనే బావిలో పడి ఉంటాడని పోలీసుల విచారణలో తేలింది. సీఐ అల్లం నరేందర్ పరిశీలించారు. మృతుడి బావమరిది సంజీవ్ దుర్వే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాధ్యతల స్వీకరణ

బెజ్జూర్, ఏప్రిల్ 28 : మండల కేంద్రంలోని సహకార సంఘం చైర్మన్‌గా అర్షద్ హుస్సేన్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. తన పదవిని తొలగించాలని గతంలో కొందరు ప్రయత్నించారని అర్షద్ తెలిపారు. దీనిపై హైకోర్టును ఆశ్రయించడంతో తిరిగి చైర్మన్‌గా కొనసాగేలా జడ్జిమెంట్ వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో సంజీవ్ కుమార్, డైరెక్టర్ శ్రీహరి, నాయకులు ఇంజిరి రాజారాం, ఖాజా మోహియొద్దీన్ పాల్గొన్నారు.

ఘనంగా అంబేద్కర్ జయంతి

కేక్ కట్ చేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు భరత్ వాగ్మారే

జైనూర్, ఏప్రిల్ 28 : జైనూర్ మార్కెట్ యార్డ్‌లో ఆదివారం అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఏజెన్సీ గిరిజన ఇతరుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భరత్ వాగ్మారే, వంజారా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ ముండే, పలువురు వక్తలు హాజరయ్యారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పంచశీల జెండా ఆవిష్కరించారు. ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహాన్నదాం చేశారు. సాయంత్రం అంబేద్కర్ చిత్రపటంతో ప్రత్యేక వాహనం ద్వారా యువకులు, పెద్దలు శోభాయాత్ర చేపట్టారు. మాంగ్ సమాజ్ సంగం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మహాలే దత్త, జైనూర్ ఆర్ఐ సుధాకర్, మార్కెట్ కమిటీ ఉద్యోగి మధు, జామిని మాజీ సర్పంచ్ మెస్రం రాహుల్, ఉప సర్పంచ్ డోంగ్రే సమాధాన్, అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షుడు కాంబ్లే అన్నారావు, జయంతి నిర్వహణ కమిటీ అధ్యక్షుడు కాంబ్లే బాబాసాహెబ్, అంబేద్కర్ యూత్ సంఘం అధ్యక్షుడు సోన్ కాంబ్లే సిద్ధు, సంఘ నాయకులు కాంబ్లే అశోక్, సతీశ్, సోన్ కాంబ్లే జనార్దన్, కాంబ్లే నాగోరావు, బాబాసాహెబ్, వెంకటేశ్, వివిధ దళిత సంఘాల నాయకులు, యూత్ నాయకులు, దళితులు పాల్గొన్నారు.

అటవీశాఖ ఆంక్షలు ఎత్తివేయాలి

మాట్లాడుతున్న సామాజిక కార్యకర్త భూమాచారి

జన్నారం, ఏప్రిల్ 28 : అటవీ శాఖ అధికారులు కవ్వాల్ టైగర్ రిజర్వ్ పేరుతో అడవిలోకి భారీ వాహనాల రాకపోకలకు విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని సామాజిక కార్యకర్త శ్రీరాముల భూమాచారి అన్నారు. జన్నారం మండల కేంద్రంలోని ఆర్యవైశ్య భవనంలో ఆదివారం జన్నారం, పొనకల్, ఇందన్‌పెల్లి గ్రామాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అటవీ శాఖ అంక్షలు విధించడం వల్ల జన్నారం, ఉట్నూర్, కడెం, దండేపెల్లి మండలాల వ్యాపారులు, ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడడంతోపాటు, ఆర్థికంగా నష్టపోతున్నారని, ప్రజలకు పనులు దొరకకపోవడంతో వలసలు వెళ్లాల్సి వస్తున్నదని పేర్కొన్నారు. వెంటనే అటవీ శాఖ విధించిన ఆంక్షలను ఎత్తివేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఓంకారేశ్వర్, అక్బరుద్దీన్, పరశురాం, లావుడ్యా సుదన్‌లాల్, కే మహేష్, మామిడి విజయ్, దయాకర్ రావు, కే అంజన్న, కొమురెల్లి సందీప్, వామన్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాష మాధుర్యాన్ని ఆస్వాదిద్దాం

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 28 : తెలుగు భాష మాధుర్యాన్ని ఆస్వాదిద్దామని ప్రముఖ కవి మత్యబోయిన మలయ శ్రీ అన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో ఆదివారం జిల్లా సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు భాష అత్యంత మధురమైనదని, బాల్య దశ నుంచే మాతృ భాష గొప్పదనాన్ని చిన్న పిల్లలకు నూరిపోయాలన్నారు. అనంతరం సమితి ప్రధాన కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్, బెల్లాల సుగుణాకర్, జంబోజు సత్తయ్య తదితర కవులు తమ కవితాగానాన్ని వినిపించారు.

మహిళ మెడలో పుస్తెల తాడు చోరీ

కాసిపేట, ఏప్రిల్ 28 : కాసిపేట మండలం దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి లంబాడీతండాకు చెందిన సత్తవ్వ మెడలో నుంచి పుస్తెలతాడు చోరీకి గురైందని ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. శనివాం రాత్రి ఇంటి ఎదుట వరండాల్లో నిద్రిస్తుండగా, ఆదివారం తెల్లవారు జామున గుర్తుతెలియని దుండగుడు తులమున్నర మంగళసూత్రాన్ని లాక్కెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఏసీపీ రవికుమార్, సీఐ శశిధర్ రెడ్డి పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేశారు.

కొత్త గనులు ఏర్పాటు చేయాలి

సీసీసీ నస్పూర్, ఏప్రిల్ 28 : సింగరేణిలో నూతన బొగ్గు గనులను ఏర్పాటు చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం నస్పూర్‌కాలనీ సేవా భవన్ ఆవరణలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. నాయకులు ఎండీ యూసఫ్, షాబీర్‌పాషా, వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, అక్బర్‌అలీ, కిషన్‌రావు, కొమురయ్య, మేకల దాసు, రేగుంట చంద్రశేఖర్, అఫ్రోజ్‌ఖాన్, జోగుల మల్లయ్య పాల్గొన్నారు.

ఓసీపీల్లో విధుల సమయాలు మార్చాలి

- క్వారీలో రెస్ట్ షెల్టర్స్ పెంచాలి
- యాజమాన్యానికి టీబీజీకేఎస్ విజ్ఞప్తి

శ్రీరాంపూర్, ఏప్రిల్ 28 : ఎండవేడిని దృష్టిలో పెట్టుకొని సింగరేణి వ్యాప్తంగా ఉన్న 20 ఓసీపీల్లో కార్మికుల విధుల సమయాలు మార్చాలని సీఎండీ బలరాంను టీబీజీకేఎస్ విజ్ఞప్తి చేసినట్లు యూనియన్ ఏరియా స్టీరింగ్ కమిటీ సభ్యులు కే సురేందర్‌రెడ్డి, బండి రమేశ్, పెట్టం లక్ష్మణ్, పానగంటి సత్తయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. ఉష్ణోగ్రతలు 48 నుంచి 50 డిగ్రీలుగా నమోదవుతున్నాయన్నారు. క్వారీలో వేడి మరీ ఎక్కువగా ఉంటుందని తెలిపారు. అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా కార్మికులు వడదెబ్బకు గురికావాల్సి వస్తుందన్నారు. భారత వాతావరణ శాఖ సూచన మేరకు కార్మికులకు ప్రాణహాని లేకుండా ఓసీపీల్లో రక్షణ చర్యలు చేపట్టాలని, కార్మికుల విధులు మొదటి బదిలీ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, 2వ బదిలీ సాయంత్రం 4 నుంచి రాత్రి 11 గంటల వరకు మార్చి అమలు చేయాలని కోరారు. ఓసీపీల్లో కార్మికులకు మజ్జిగ పాకెట్లు అధనంగా ఇవ్వాలని, బట్టర్‌మిల్క్ పాకెట్లు అందించాలన్నారు. క్వారీలో అదనపు విశ్రాంతి షెల్టర్లు పెంచాలని కోరారు. వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు పొగాకు రమేశ్, అన్వేష్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, వికాస్, రాజునాయక్, ఉప్పల సంపత్, ఉత్తేజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.